'వస్తే.... ఈ విరిగిపోయిన అద్దాలు అవీ చూశాడంటే నన్ను జీళ్ళపాకంలాగా సాగదీస్తాడు....'

తల రెండు చేతుల్తో పట్టుకున్నాడు రాంబాబు. కిష్టయ్య రాంబాబు వంక జాలిగాచూశాడు.

'అసలీవేళ ఎంత నష్టం జరిగుంటుందండీ గురూగారూ?'

రాంబాబు డ్రాయరు సొరుగులోంచి కాగితం పెన్ను తీశాడు.

'ఏమేం విరిగాయో చెప్పు....లెక్క కడ్డాం....' కిష్టయ్య చెప్పసాగాడు.

సరిగ్గా అదే సమయంలో స్టూడియోలోకి ఒక వ్యక్తి వచ్చాడు. ఇద్దరూ తలలు తిప్పి అతని వంక చూశారు.

"బుక్" అయిన సిన్మాపిచ్చోడు

అతను అయిదడుగుల పదంగుళాల పొడవున్నాడు. నల్లని శరీరఛాయ. పొట్టిగా కత్తిరించిన జుట్టూ గుబురు కనుబొమ్మలు. కళ్ళలో ఎఱ్ఱని జీర. కళ్ళకింద పూరీ వొత్తడానికి ముందు పిండిముద్దలా ముక్కు, దాని కింద లావు పెదాలు. మనిషి పెద్దపొట్టతో లావుగా బలంగా ఉన్నాడు.

అతని ఆకారం చూడగానే రాంబాబుకి కంగారు పుట్టింది.

అతను చొక్కా చేతులు పైకిమడుస్తూ రెండడుగులు ముందుకువేశాడు.

రాంబాబు, కిష్టయ్య కంగారుగా కుర్చీలోంచి లేచి రెండడుగులు వెనక్కి వేసి ఇప్పుడెలా అన్నట్టు ఇద్దరూ ముఖముఖాలు చూస్కున్నారు.

కొంపతీసి ఇందాక గుంపుతో రావల్సిన మనిషి ఇప్పుడు ఆలస్యంగా వచ్చాడా?... వీడేమేం పగలగొడ్తాడో....'ఇక్కడ ఫోటోలు తీస్తారండీ....' ఎవరిదో అమ్మాయిది, తీయని కంఠస్వరం వినిపించింది.

రాంబాబు, కిష్టయ్య ఆతృతగా గుమ్మం వైపు చూశారు.

అక్కడెవరు అమ్మాయి కనిపించలేదు.

'కాస్త నువ్వు ముందుకి వెళ్ళి బయటికి పెట్టి అటూ ఇటూ చూసి 'ఇక్కడెవరూ లేరండి....' అన్నాడు.

కిష్టయ్య గుమ్మం దగ్గరకు వెళ్ళి తల బయటికి పెట్టి అటూ ఇటూ చూసి 'ఇక్కడెవరూ లేరండి....' అన్నాడు.

'ఇక్కడ ఫోటోలు తీస్తారాండీ!...'

మళ్ళీ అదేగొంతు!!.... ఇందాకటి కన్నా తీయగా....

రాంబాబు అనమానంగా తన ఎదురుగా ఉన్న అతని వంక చూశాడు.

'ఇప్పుడు మాట్లాడింది మీరా?....' అన్నాడు అనుమానంగా.

అతను ఫక్కున నవ్వాడు.

'అయితే మీరుకూడా పప్పులో కాలేశారన్నమాట!!....'

రాంబాబు కిందికి వంగి కాళ్ళు చూస్కున్నాడు.

'నా ఫ్రండ్సందరూ అంటుంటారు.... నీ పర్సనాల్టీకి తగ్గగొంతుకాదురా నీది అని .... అన్నాడతను తీయని గొంతుతో.

అతని నవ్వు ముఖం చూసిన రాంబాబుకి కిష్టయ్యకి కాస్తధయిర్యం వచ్చింది.

'ఇంతకీ మీకేం కావాలి?' అన్నాడు రాంబాబు.

'ఇక్కడ ఫోటోలు తీస్తారా?' అన్నాడతను అమ్మాయి గొంతుతో.

'భలేవారే... ఫోటో స్టూడియోకి వచ్చి ఫోటోలు తీస్తారా అని అడుగుతారేం సార్... రండి సార్.... రండి.... కూర్చోండి.....' అంటూ మర్యాదలు చేశాడు కిష్టయ్య.

'రేట్లు చెప్పండి ....' అన్నాడతను.

టేబులు మీది గ్లాస్ కింద ఉన్న రకరకాల సైజులు ఫోటోలని చూపిస్తూ పాస్ పోర్టు సైజు ఫోటో అయితే ఎంతో ....కార్డు సైజు ఫోటో అయితే ఎంతో....కాబినెట్ సైజు ఫోటో అయితే ఎంతో.... ఎక్స్ట్రాకాపీలయితే ఎంతోరేట్లు వివరించాడు రాంబాబు.

అతను ముఖం చిట్లించాడు.

'ఈ చుట్టుపక్కల మంచి ఫోటో స్టూడియో ఉందా?' అన్నాడు.

రాంబాబు తెల్లబోయాడు.

'అదేంటండి అలా అంటారు?.... ఈ స్టూడియోకి ఏమైందని!'

'ఈ అద్దం కింద ఉన్న ఫోటోలన్ని మీరు తీసినవేనా చాలా చంఢాలంగా ఉన్నాయ్...'

రాంబాబు కిష్టయ్య ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూస్కున్నారు.

కిష్టయ్య రాంబాబు చెవిలో ఏదో చెప్పాడు. రాంబాబు చిరునవ్వు నవ్వాడు. కళ్ళు పైకి పెట్టి ఒక్క క్షణం ఆలోచించి తను వంగి కిష్టయ్య చెవిలో ఏదో చెప్పాడు.

కిష్టయ్య కిలకిల నవ్వాడు.

ఇద్దరూ షేక్హాండ్ ఇచ్చుకుని ఒకరినొకరు చూస్కుని కళ్ళుకొట్టుకున్నారు.

అతను ఈ తతంగం అంతా గమనించి చాలా కన్ఫ్యూజ్ అయిపోయాడు.

'ఏమిటి ... ఏమిటిదంతా?!!'

రాంబాబు కొంటెగా నవ్వుతూ అన్నాడు. 'ఏమిటీ... ఈ అద్దం కింద ఫోటోలు చాలా చంఢాలంగా ఉన్నాయా?'

'నేనే కాదు.... ఈ ఫోటోలు చూసిన ఎవరైనా అదేమాట అంటారు....'

రాంబాబు, కిష్టయ్య ఇద్దరూ మళ్ళీ ఒకరినొకరు చూసుకొని కళ్ళు కొట్టుకున్నారు.

ఇద్దరూ ఒకేసారి అతని వంకచూసి ఘొల్లున నవ్వారు.

'ఫోటో లు చంఢాలంగా ఉండక మరెలా ఉంటాయ్.... అవి మేం తీసినవి అయితేగా ....వేరే ఫోటో

స్టూడియో వాళ్ళు తీసినవి ఇక్కడ పెట్టాం...' అన్నాడు రాంబాబు.

'వేరే ఫోటో స్టూడియో వాళ్ళు తీసినవి ఇక్కడెందుకు పెట్టారు?' అతను ఆశ్చర్యంగా చూశాడు.

'మరి మా ఫోటో స్టూడియో కొత్తగాపెట్టాం కదండీ..... మా దగ్గర రకరకాల సైజుల ఫోటోలు లేవు కదండీ....మరి మా దగ్గరకొచ్చే మీలాంటి కస్టమర్లకి ఫోటోలు చూపించాలి కదండీ... అందుకే వేరే స్టూడియోల నుండి కొన్ని ఫోటోలు తెచ్చి ఇక్కడ పెట్టాం....కదండీ గురూగారూ....' అన్నాడు కిష్టయ్య రాంబాబు వంక చూసి కన్ను కొడుతూ.

'అంతేకదా మరి....' అన్నాడు రాంబాబు తిరిగి కిష్టయ్యకి కన్ను కొడుతూ.

'మీరు నిజంగానే చెపుతున్నారు కదా!!....' అన్నాడతను సందేహంగా.

'నిజంగానే సార్ ....' అన్నాడు కిష్టయ్య.

'మీరు కొత్తగా స్టూడియో పెట్టామంటున్నారు.... బాగానేతీస్తారుకదూ..అసలే నేను ఈ ఫోటోలు ఒక ప్రోడ్యూసర్‌గారికి మరోడైరెక్టర్ గారికి పంపించాలని అనుకుంటున్నాను....'

'ఏమిటీ...సినిమా హీరో అయిపోదామనే.... అయితే... ఇంకేం.... మా స్టూడియోలో ఫోటోలు తీయించుకుని వాటిని ఏ డైరెక్టరుకి చూపించినా మీకు హీరోఛాన్సు ఖాయం.... చూశారుగా వేరే స్టూడియోల్లో తీయించుకున్న ఫోటోలు ఎలా ఉన్నాయో' అన్నాడు అద్దంకింద వున్నఫోటోలు చూపిస్తూ కిష్టయ్య.

'రండి సార్.... ఇంకా ఏం ఆలోచిస్తారు!!' అంటూ అతని జబ్బపట్టుకుని లోపలికి లాక్కెళ్ళిపోయాడు రాంబాబు.

'నేను ఈ ఫోటోలు సినిమా ఛాన్సు కోసం తీయించుకుంటున్నానండీ...బాగా తియ్యాలి....' అన్నాడతను.

'మీరే చూస్తారుగా....' అన్నాడు రాంబాబు.

'మరి మీరు సినిమాల్లోకి వెళ్ళాలనుకుంటున్నారు కదా....మీ గొంతు అలా ఉంటే ఎవరయినా తీసుకుంటారాండీ....' అని అమాయకంగా అడిగాడు కిష్టయ్య.

'గొంతుదేం ఉంది...డబ్బింగ్ వాయిస్ పెడతారుగా....' అన్నాడతను ఆ మాత్రం తెలీదా అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తూ.

'మరి పొట్ట ఎలా గండీ .... చాలా పెద్దగా వుంది కదా?'

'లోపల్నుండి ఓ వెడల్పాటి బెల్టుతో పొట్టమీంచి గట్టిగా బిగించిపైన చొక్కా వేసుకుంటారు.... అంతేకదండీ.....' అన్నాడు రాంబాబు అతనితో.

అతను బిక్క మొహం వేస్కుని అవునన్నట్టు తలఊపాడు.

'క్రాపు చూడు ఎలా ఉందో....'

'దాందేముందీ....మాంచి విగ్గు పెట్టేస్తారు..అంతే కద్సార్.... '

అతను ఇంకా బిక్కచచ్చిపోయి తల ఊపాడు.

'మరి ముక్కేమో పిండిముద్దలాగా ఉంది....దాన్నేం చేస్తారు గురూగారూ....'
'ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే సరిపోతుంది.... నేను కరెక్ట్ కదండీ....' అన్నాడు రాంబాబు అతనితో.

అతను ఉక్రోషంగాలేచి నిలబడ్డాడు.

'ఇలాగయితే నేను మీ ఫోటో స్టూడియోలో ఫోటోతీయించుకోనంతే...'

రాంబాబు కస్సుబుస్సు మన్నాడు.

'ఒరేయ్ కిష్టిగా .... నువ్వు నీ సందేహాలన్నీ ఓ పక్కన పెట్టి లైటింగ్ ఎరేంజిమెంట్స్ చెయ్యి...మీరు వాడిమాటల్నేమీ పట్టించుకోకండి సార్.... చెప్పండి ఏఏ యాంగిల్స్‌లో తియ్యమంటారు....'

'ఒకటేమో సైడు పోజండి. ఇంకోటేమో ఎదురుగానండీ బస్ట్ సైజు ఇంకోటేమో ఫుల్ అండీ...నిలబడి.'

'సరే...అలా కూర్చోండి....లైట్సు వెయ్యరా కిస్టిగా ఏదీ .... కాస్త అటుపక్కకి చూడండి....ఆ...అలా...అలాగే....ఊ....ఇప్పుడు నవ్వండి....'

'హ్హ హ్హ హ్హ ....'

'అబ్బే..అలా శబ్దం వచ్చేలా అక్కర్లేదు....కాస్త చిరునవ్వు నవ్వితే చాలు...అబ్బే...నవ్వడంలేదు మీరు...రెడీ....స్మైల్ ...'

కిష్టయ్య చిరాగ్గా చూశాడు....

'మీరు బిగుసుకుపోతున్నారు సార్...అలా అయితే మేం చచ్చినోడికి ఫోటో తీశాం అనుకుంటారు....కాస్త ఫ్రీగా ఉండండి...'

'అలాగంటే నేను ఫోటో తీయించుకోనంతే' అన్నాడతను కోపంగా చూస్తూ.

'ప్లీజ్....మీరు మంచోరు కదండీ... అలా అనకూడదు. ఒరేయ్ కిష్టిగా..నువ్వు కాస్సేపు నోరు మూసుకో....' అన్నాడు రాంబాబు.

కిష్టయ్య చెంపలు వేసుకున్నాడి. 'సర్లేండి గురూగారూ..నాకేం పట్టింది..నోరు మూసుకుంటా...'

అతను శాంతించాడు.

రాంబాబు అతను కోరిన విధంగా ఫోటోలు తీశాడు.

ఎడ్వాన్సు ఇస్తూ అతను స్టూడియో పరికిస్తూ 'అద్దాలవీ ఇలా విరిగిపోయాయేంటండీ....' అని అడిగాడు.

'మా స్టూడియో పెట్టాక ఈ చుట్టుపక్కల ఉన్న వేరే స్టూడియోల డిమాండ్ పడిపోయిందండీ.... అందుదే ఓర్వలేక వాళ్ళు గూండాలని పెట్టించి ఇలా పగలగొట్టించారు' అని అతనికి చెప్తూ కిష్టయ్యని చూసి కన్నుకొట్టాడు రాంబాబు. కిష్టయ్య కూడా రాంబాబుకి కన్ను కొట్టాడు.

అతను ఇద్దరి వంకా అయోమయంగా చూసి బయటకి అడుగు పెట్టాడు.

కిష్టయ్య పక్కుమని నవ్వాడు.
'ఎలాగయినా ఈ ఫోటోలు తీయించుకోడానికి వచ్చేవాళ్ళతో గొప్ప కాలక్షేపం అయిపోతుంది గురూగారూ... అతను బిగుసుకుపోయి బిక్కమొహం వేస్కుని ఫోటోలు తీయించుకుంటుంటే భలే నవ్వొచ్చిందండీ....'
'నిజమే అనుకో ... కానీ మన ఫీలింగ్స్ వాళ్ళకి కనిపిస్తే బిజినెస్ దెబ్బతిం టుంది. మనకి నవ్వొచ్చినా ఆపుకోవాలి' అన్నాడు రాంబాబు.
అప్పుడు రాత్రి ఎనిమిదయింది.



'ఇంక కట్టేసి వెళ్ళి పోదాం గురూగారూ....ఇప్పుడేవరొస్తారు అన్నాడు కిష్టయ్య.
'నువ్వు పొద్దున స్టూడియో తెరిచినప్పటి నుండి వెళ్ళిపోదాం వెళ్ళిపోదాం అంటావ్.... ఇలాగైతే బిజినెస్ జరిగినట్టే..నీ మాటవిని ఇందాకే వెళ్ళిపోయి ఉంటే ఆసినిమా పిచ్చోడి ఫోటోలు తీయగలిగి ఉండేవాళ్ళమేనా?' అన్నాడు రాంబాబు.
'నా మాటవిని వెళ్ళిపోయి ఉంటే ఇలా అద్దాలన్నీ పగలగొట్టిచుకుని ఉండేవాళ్ళాంకాదు....' అన్నాడు కిష్టయ్య....
రాంబాబు కి ఏమనాలో తోచలేదు.

'అదే నిజమేననుకో....' అన్నాడు బుర్రగోక్కుంటూ ఇంతలో 'ఎక్స్కుక్యూజ్మీ' అంటూ తీయని కంఠస్వరం వినిపించింది.

తలెత్తి ఆమె వంక చూసిన ఇద్దరూ అలానే నోళ్ళు తెరుచుకుఉండిపోయారు.

ఆమె స్కైబ్లూ కలర్ శారీ అదే రంగు బ్లవుజు వేస్కుంది. షాంపూతో తలంటు పోసుకుని జారుగా జడవేసుకుంది. జడలో మల్లెల సువాసన స్టూడియో మొత్తం వ్యాపించింది. అందమైన కళ్ళు... కానీ వాటిల్లో ఏదో చెప్పలేని దిగులు ఉన్నట్లు భావన...కేవలం ఊహ మాత్రమే కావచ్చు. చిన్నమూతి. ఏదో చెప్పాలని అనుకుంటున్నట్టు కొద్దిగా విడివడిన పెదాలు. ముచ్చటైన సన్నని ముక్కు. అందమైన విగ్రహం ఆమెకి పాతికేళ్ళు ఉంటాయేమో.

ఆమె చిన్నగా దగ్గి మళ్ళీ 'ఎక్స్ క్యూజ్మీ ' అంది.

రాంబాబు కిష్టయ్య ఈ లోకంలో పడ్డారు.

'అలాదిక్కులు చూస్తావేంరా... మేడమ్కి ఏంకావాలో చూడు...' అన్నాడు రాంబాబు కిష్టయ్యని అదమాయిస్తూ.

కిష్టయ్య గబుక్కున లేచి నిలబడ్డాడు.

'రండి మేడమ్..రండి...ఫోటో ఎలా తెయించుకుంటారు?.... బస్ట్దాకానా, ఫుల్సైజా.... నిలబడి తీయించుకుంటారా కూర్చునా? ముందు నుండి తీయించుకుంటారా వెనుకనుండా... అబ్బె...క్షమించండి... వెనక నుండి కాదు పక్కనుండి... పక్కనుండి తీయించుకుంటారా...?' గబగబా అడిగాడు కిష్టయ్య.

ఆమె సమాధానం ఏమీ చెప్పకుండా అద్దంకింద ఫోటోలు చూడ సాగింది.

కిష్టయ్య కంగారుగా కుర్చీ చేతిమీద నాప్‌కిన్ తీసి అద్దంమీద పరిచేశాడు.

రాంబాబు అయోమయంగా ముఖంపెట్టి కనుబొమ్మలు ఎగరేశాడు ఏమిటన్నట్లు.

కిష్టయ్య ముందుకు వంగి రాంబాబు చెవిలో గుసగుసలాడాదు. ‘ ఆ అద్దంకింది ఫోటోలు ఆమె చూస్తే మన దగ్గర ఫోటోలు తీయించుకోదండి గురూగారూ.. అందుకే వాటి మీద గుడ్డ కప్పేశా...’

ఆమె చిరునవ్వుతూ అంది.

‘నేను ఫోటో తీయించుకోడానికి రాలేదండీ....’

రాంబాబు, కిష్టయ్య ఇద్దరూ నాలుక్కరుచుకున్నారు.

కాస్సేపయ్యాక తేరుకుని రాంబాబు అన్నాడు.

‘మరి ఫోటో తీసుకుని కాపోతే ఫోటో స్టూడియోకి ఎందుకొచ్చారండీ?’

ఆమె తన చేతిలోని కెమెరా లో ఎప్పుడు ఫిల్మ్ లోడ్‌చేసినా కాస్తభాగం ఎక్స్‌పోజ్ అయిపోతుంది... మీ దగ్గర డార్క్‌రూం ఉంటుందిగా...కాస్త లోడ్ చేసిపెట్టరూ...’ అంది ఆమె వ్యానిటీబాగ్‌లోంచి ఫిల్మ్ తీసి కెమెరా పక్కన పెడుతూ.

ఎంత తీయని కంఠం.... అనుకున్నాడు రాంబాబు.

అదే వేరే వాళ్ళయితేతే మంచి బేరమే తగిలింది అనుకునేవాడు....కానీ అందమైన అమ్మాయి అడిగితే ఏ మగాడు మాత్రం విసుక్కుంటాడు!!....

‘దాందేముందండీ....తప్పకుండా...ఇట్సే ప్లెజర్.... అంతే కదండీ గురూగారూ....’ అన్నాడు కిష్టయ్య.

రాంబాబు కిష్టయ్య వంక గుర్రుగా చూసి ఆమె వైపు తిరిగి చిరునవ్వుతో

‘దాందేముందండీ...తప్పకుండా..... ఇట్సే ప్లేజర్... ’ అన్నాడు.

‘ఈ కెమెరాని ననేను కొత్తగా కొన్నాను. దీనికున్న ఎడ్జెస్టుమెంట్ గురించి నాకు పూర్తిగా తెలీదు....కాస్త చెబుతారా...ప్లీజ్....’

‘దాందేముందండీ...తప్పకుండా....ఇట్సే....’

రాంబాబు కోపంగా చూసేసరికి, కిష్టయ్య రెండు చేతుల్తోనోరుమూసుకున్నాడు.

రాంబాబు ఆ కెమెరాకున్న ఎడ్జస్టుమెంట్స్ అన్నింటి గురించి ఆమెకి వివరంగా చెప్పాడు.

‘ఫైనల్‌గా సెల్ఫ్ టైమర్ గురించి ... దీన్ని ఉపయోగించి మీకు మీరే ఫోటో తీసుకోవచ్చు.